క్లుప్తంగా

ఎయిడెడ్ పాఠశాలల పరిశీలన



భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓలు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట మండలంలోని ఎయిడెడ్ పాఠశాలలను రేణిగుంట మండల విద్యాశాఖ అధికారులు ఇందిరాదేవి, రంగనాథ్ శుక్రవారం తనిఖీ చేశారు. ప్రధానంగా మండలంలోని జీవాగ్రం హైస్కూల్, రేణిగుంటలోని పాత చెక్ పోస్ట్ ప్రాంతంలోని ఆర్‌సీఎం హైస్కూల్, ప్రైమరీ స్కూళ్లలో భోజనాల నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. చిన్నపిల్లలు వందశాతం యూనిఫామ్‌లో పాఠశాలకు రావడం ఆనందంగా ఉందన్నారు.

న్యాయం చేయండి



ఎస్‌ఐ విశ్వనాథనాయుడుతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని రేకులషెడ్డులో చిరు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న దివ్యాంగుడు శ్రీనివాసులుకు న్యాయం చేయాలని శుక్రవారం పర్సన్స్ విత్ డిజైబులిటీ ఫెడరేషన్ నాయకులు తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎస్‌ఐ విశ్వనాథనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగుడు శ్రీనివాసులు కుటుంబం బజారు వీధిలో 30 ఏళ్లుగా రేకుల షెడ్డు వేసుకుని చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. వ్యాపార అభివృద్ధికి రేకుల షెడ్డు మెరుగుదల కోసం ప్రయత్నించగా తోబుట్టువులే అడ్డుకుని, అన్యాయంగా ప్రవర్తిస్తున్నారన్నారు. వీరికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పర్సన్స్ విత్ డిజైబులిటీ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షుడు మురళిగౌడ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు కృష్ణమనాయుడు, మహిళా అధ్యక్షురాలు సరస్వతి పాల్గొన్నారు.

కమిటీ ఏకగ్రీవం

నాగలాపురం : మండల కేంద్రంలోని టీపీ కోట పంచాయతీలో బర్కతుల్ మాబారక్ మదీన మజీద్‌లో శుక్రవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో 12 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు మహ్మద్‌అలీ, షబీర్, ఈసుబ్, షఫియుల్ల, సమియుల్ల, షరీఫ్, ఖమురుద్దీన్ ఎన్నికయ్యారు.

నివాళి



సత్యవేడు: కవరోపేట(తమిళనాడు)వద్ద రైలు ప్రమాదంలో మృతి చెందిన సత్యవేడు వాసి బాలాజీ మృతదేహానికి వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ నివాళి అర్పించారు. తమిళనాడులోని కవరోపేట రైల్వే స్టేషన్ వద్ద రైలు దిగుతూ ప్రమాదానికి గురై బాలాజీ మృతి చెందిన విషయం విదితమే. అంతకు ముందు శిరుణంబూదూరు సర్పంచ్ ఆనంద్ తల్లి కుప్పమ్మ(67) మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బీరేంద్రవర్మ, నిరంజన్ రెడ్డి, సుశీల్‌కుమార్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

పొన్నాలమ్మకు పూజలు



శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్‌లో వెలసిన పొన్నాలమ్మ అమ్మవారికి ధనుర్మాసం పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక



జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో జ్ఞాపికను అందుకుంటున్న వరదయ్యపాళెం విద్యార్థులు

వరదయ్యపాళెం : వరదయ్యపాళెం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు తయారు చేసిన స్మార్ట్ బ్లైండ్ మ్యాన్ స్టిక్ రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. శుక్రవారం శ్రీకాళహస్తిలో నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఈ స్మార్ట్ బ్లైండ్ మ్యాన్ స్టిక్‌ను ఎంపిక చేశారు. స్టిక్‌ను తయారు చేసిన విద్యార్థులు కె.రితీష్, కె.వరుణ్ రెడ్డి, సహకరించిన ఉపాధ్యాయుడు మేఘనాథ్‌ను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు.

ప్రమాదాలు @ మర్రికుంట

- వరుస ఘటనలతో బెంబేలు
- చిమ్మచీకట్లో సర్కిల్
- ఇబ్బందుల్లో ప్రయాణికులు



మర్రిగుంట సర్కిల్

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : పాపానాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి రేణిగుంట మండలం మర్రికుంట సమీపంలో ఏర్పాటు చేసిన నూతన సర్కిల్ ప్రమాదాలకు నిలయంగా మారింది. వరుస రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుండటంతో వాహనదారులు అటు వెళ్లాలంటే బెంబేలెత్తున్నారు. సర్కిల్ నుంచి పాపానాయుడుపేటకు వెళ్లే సర్వీస్ రోడ్డు మరమ్మతులు చేస్తుండడంతో వాహనదారులు ఆపోజిట్ రోడ్డులో వెళ్లడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మర్రికుంట సర్కిల్లో ఆర్టీఓ అధికారులు వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహిస్తున్నారు. భారీ వాహనాలు సర్కిల్లో పార్కింగ్ చేస్తుండటంతో ఏ వాహనం ఎటు వెళుతుందో కనపడక బైక్‌లో వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. సర్కిల్ తిరుపతి వైపు వెళ్లేటప్పుడు పక్కనే ఫ్లై ఓవర్ ఉండడంతో తిరుపతి వైపు నుంచి వచ్చే వాహనాలు వేగంగా వస్తున్నాయి.

అంధకారంలో సర్కిల్

సర్కిల్లో లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో సాయంత్రం అయ్యే సరికి అంధకారం నెలకొంటోంది. పక్కనే ఉన్న మర్రిగుంట వాసులు సర్కిల్ దాటే క్రమంలో చీకటి ఉండటంతో ఏ వాహనం ఎటు వస్తుందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బైకులో వెళ్లే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు.

సర్వీస్ రోడ్డులో మరమ్మతు పనులు

సర్కిల్ నుంచి పాపానాయుడుపేటకు వెళ్లే సర్వీస్ రోడ్డు కొన్నిరోజులుగా గుంతలు ఏర్పడి వాహనాలు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సర్కిల్ నుంచి ఎడమ వైపు వెళ్లాల్సిన వాళ్లు కుడి వైపున రాంగ్ రూట్‌లో వెళ్తున్నారు. అందువల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నాలుగు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంపై స్పందించిన ఎన్‌హెచ్ అధికారులు సర్వీస్ రోడ్డుకు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు.



ఆర్టీఓ అధికారుల తనిఖీలతో సర్కిల్ వద్ద ఆగిన వాహనాలు



చిమ్మ చీకటిలో సర్కిల్

ఈ-క్రాప్ తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని రైతులు తప్పనిసరిగా ఈనెల 15వ తేదీలోపు ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి భారతి తెలిపారు. శుక్రవారం వెస్టువరత్తూరు, నెలవాయి, కారణి గ్రామాల్లోని పంట పొలాలకు వెళ్లి ఈ-క్రాప్ బుకింగ్ చేసి, రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతు పంటలకు ఈ-క్రాప్ నమోదు చేయించాలని తెలిపారు. ఈ క్రాప్ బుకింగ్‌తో సున్నా వడ్డీ, పంట రుణాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్ట పరిహారం, మద్దతు ధరపై పంటల కొనుగోలు తదితర పథకాలకు అర్హుల వుతారన్నారు.

5న సత్యవేడులో వైఎస్సార్‌సీపీ సమావేశం



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న సమన్వయకర్త నూకతోటి రాజేష్

సత్యవేడు : పట్టణంలో ఆదివారం ఉదయం 10 గంటలకు బేరిశెట్టి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. గురువారం సత్యవేడులోని పార్టీ మండల అధ్యక్షుడు సుశీల్‌కుమార్ రెడ్డి ఇంటి వద్ద పార్టీ నాయకులతో నూకతోటి రాజేష్ సమావేశం అయ్యారు. వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, ఎంపీ గురుమూర్తి ఈ సమావేశానికి హాజరవుతారన్నారు. ఏడు మండలాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బీరేంద్రవర్మ, భాను ప్రకాష్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, రమేష్, శ్యాంప్రసాద్ రెడ్డి, దామోదర్ రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, సెందిల్, మోహన్ మధురాజు, శ్రీధర్, పునిదకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల సంఘాలు

శ్రీకాళహస్తి : కిశోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయడమే లక్ష్యమని ఎంపీడీఓ సురేంద్రనాథ్ పేర్కొన్నారు. తొట్టంబేడు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మండలస్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. కౌమారదశలో ఉన్న పిల్లలతో వ్యవహరించే విషయాలు, వారిని సంఘాలుగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీ ఓ శాంతిదుర్గ , అధికారులు పాల్గొన్నారు.

గుంతలకు మరమ్మతులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట రహదారిపై పడిన గుంతలను సర్పంచ్ నగేషం ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులతో సిమెంట్ కాంక్రీట్ వేసి తాత్కాలికంగా గుంతలను పూడ్చారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో గుంతల విషయంపై ఆటో డ్రైవర్లు , టాక్సీ డ్రైవర్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అందులో భాగంగా పంచాయతీ సిబ్బందితో గుంతలను సిమెంట్‌తో పూడ్చారు.

అక్రమాలపై విచారణ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో బిల్లుల అవకతవకలు జరిగాయని వార్డు సభ్యులు డీపీఓకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి కలెక్టరేట్‌లోని కార్యాలయంలో రికార్డులను పరిశీలన చేసి విచారణ చేపట్టారు. రేణిగుంట మేజర్ పంచాయతీలో జరిగిన పనుల్లో కొన్ని అవకతవకలు జరిగాయని దొంగ బిల్లులతో పంచా యతీ సొమ్మును కాజేశారని వార్డు సభ్యులు డీపీఓ సుశీలాదేవికి ఫిర్యాదు చేశారు. అభియోగాలపై శుక్రవారం రేణిగుంట పంచాయతీ ఈఓ మణి నుంచి వివరణ తీసుకున్నారు. శనివారం కూడా రికార్డులు పరిశీలన, విచారణ కొనసాగుతుందని సమాచారం.

ఊంజల్ సేవ



ఊయల సేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం : పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం ఊంజల్ సేవ నేత్రపర్వంగా సాగింది. వేకువ జామున 4.30 గంటలకు తిరుప్పావై పాసురాల నివేదనతో పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తెరిచిన అర్చకులు నిత్యపూజా కై ంకర్యాలు, ధనుర్మాస పూజలను పూర్తి చేశారు. నైవేద్య సమర్పణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం 7 గంటలకు వేంకటేశ్వరస్వామి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి అభిషేకాలు చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై పద్మావతీ అమ్మవారిని సుందరంగా అలంకరించి అధిష్టింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఊయల సేవలో సేద తీరారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పరామర్శ

నారాయణవనం : వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ తులసిముని మృతికి సత్యవేడు నియోజకర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పార్టీ నాయకులతో కలిసి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, పార్టీ నాయకులు కిరణ్, గురుస్వామి, దొరైరాజ్, నాగూరు, శంకరయ్య పాల్గొన్నారు.

భారీగా జరిమానా

రేణిగుంట: రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో రేణిగుంట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ వారి ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి తిరుపతి కోర్టు మేజిస్ట్రేట్ జరిమానా విధించారు. ఎనిమిది మందికి ఒక్కొక్కరికీ పదివేల రూపాయల చొప్పున రూ.80,000 జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన ముగ్గురికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున మొత్తం రూ.6వేలు ఫైన్ వేశారు.

పోలీసుల కౌన్సెలింగ్

రేణిగుంట : మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి శుక్రవారం సాయంత్రం రేణిగుంట పోలీస్‌స్టేషన్‌లో సీఐ శరత్ చంద్ర, ఎస్‌ఐ అరుణ్ కుమార్‌రెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం తాగి వాహనం నడపడం వలన కలిగే అనర్థాలను వివరించారు.

కైలాసనాథుని సేవలో జేసీ



ఆధ్యాత్మిక కేంద్రమైన కైలాసనాథ కోనను జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ శుక్రవారం సాయంత్రం సందర్శించారు. తహసీల్దార్ జయరాములు, ఆలయ ఈఓ కృష్ణ నాయక్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కామాక్షాంబిక, కైలాసనాథుని ప్రత్యేక సేవలో పాల్గొన్న జేసీని ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదాలు అందజేశారు. జలపాతం, టూరిజం, దేవాదాయ శాఖల అతిథి గృహాలను జేసీ పరిశీలించారు. భక్తులు, పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాలని సూచనలు చేశారు. – నారాయణవనం

నీటి వృథా



నీటి వృథాను అరికట్టాల్సిన అధికారులు రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో నెల రోజులకు పైగా నీరు వృథా అవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. రేణిగుంట మేజర్ పంచాయతీ కార్యాలయ ముఖ ద్వారానికి పక్కనే ఉన్న నీళ్ల ట్యాంకు కొళాయి మరమ్మతులకు నోచుకోక నెల రోజులు అవుతోంది. అప్పటి నుంచి నీరు వృథాగా పోతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. పంచాయతీ అధికారులే నీటిని వృథా చేస్తుంటే ఇక ప్రజలకు నీటి పొదుపు గురించి ఏం చెబుతారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. – శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

మద్యం తాగితే జైలే!



మండలంలోని ఉబ్బలమడుగు జలపాతంలో పర్యాటకులు మద్యం తాగితే జైలుశిక్ష తప్పదని ఎస్‌ఐ విశ్వనాథనాయుడు హెచ్చరించారు. శుక్రవారం ఉబ్బలమడుగులోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఉబ్బలమడుగు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ వస్తువులను వేయవద్దని కోరారు. వన్యప్రాణులు, పర్యావరణానికి ముప్పు కలిగించొద్దని సూచించారు. – బుచ్చినాయుడుకండ్రిగ

రాకెట్ నమూనా



నమూనాను పరిశీలిస్తున్న డీఈఓ కుమార్

శ్రీకాళహస్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని కల్లివెట్టు పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన రాకెట్ నమూనా ఆకట్టుకుంది. రాకెట్ నమూనాను పరిశీలించిన డీఈఓ కుమార్ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్, ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, నాదెండ్ల మురళి, లక్ష్మయ్య, దాసు, విద్యార్థులు పాల్గొన్నారు. – బుచ్చినాయుడుకండ్రిగ

గొబ్బిదేవతకు పుర ఉత్సవం



ఊరేగింపునకు బయలుదేరుతున్న గొబ్బి దేవత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గొబ్బిదేవతకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవత ఉత్సవమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

రేణిగుంటలో శోభాయాత్ర

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో రేణిగుంటలో శుక్రవారం శోభాయాత్ర నిర్వహించారు. 5వ తేదీన ఆదివారం విజయవాడలో జరగనున్న హిందూ శంఖారావం సభను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.



శోభాయాత్రలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు

సావిత్రిబాయి జీవితం ఆదర్శం



శ్రీకాళహస్తి : పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

సత్యవేడు : సావిత్రిబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. సత్యవేడు బీసీ బాలుర గురుకుల ప్రాంగణంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ తొలి మహిళా ఉపాధ్యాయినిగా మహిళా లోకానికి సావిత్రిబాయి పూలే ఆదర్శప్రాయురాలని అన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన పాఠశాల విద్యార్థులను అభినందించారు. బాలుర గురుకులాన్ని ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని మంత్రికి ఫోన్ ద్వారా విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ రవి, ప్రిన్సిపల్ సత్యనారాయణ, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, పరమశివం(బాషా), మురళి, బీబీఎస్ రెడ్డి, బాలకృష్ణ, రమణయ్య పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి : పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఘనంగా జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాజశేఖర్ మాట్లాడుతూ.. మొదటి ఉపాధ్యాయురాలిగా ఆమె కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ దీనదయాల్, అధ్యాపకులు మాలతి గాబ్రియేల్ పాల్గొన్నారు.

- తొట్టంబేడు మండలం గుండేలిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మునితిరుమలయ్య, ఉపాధ్యాయులు చెంచయ్య, ఈశ్వరరెడ్డి, రమాదేవి, భాస్కరయ్య, శ్రీకర్, డిల్లీబాబు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం రేణిగుంట మండల విద్యాధికారి ఇందిరాదేవిని ఆశా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జూలియస్ రాజు ఘనంగా సత్కరించారు. ముందుగా ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు జూలియస్ రాజు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ రంగనాథ్, ఆశా సంస్థ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేణిగుంట : రేణిగుంట ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యాసరచన పోటీల్లో గెలిచిన విద్యార్థినులకు బహుమతుల ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు విష్ణు వర్ధనం, జన విజ్ఞాన వేదిక మండల కార్యదర్శి కుప్పస్వామి, ఉపాధ్యాయులు శిరీష, ఈశ్వరీ, విజయ కుమార్ ప్రసంగించారు. కార్యక్రమంలో వెంకటరమణ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి : పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు



సత్యవేడు : సావిత్రిబాయి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



రేణిగుంట : బహుమతి ప్రదానం చేస్తున్న జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన యోగి

శ్రీకాళహస్తి : రోడ్డు ప్రమాదంలో యోగి అనే యువకుడు గాయపడ్డాడు. వడమాలపేటకు చెందిన యోగి తన సొంత పనుల కోసం శ్రీకాళహస్తికి శుక్రవారం వచ్చాడు. శ్రీరామ్‌నగర్ కాలనీ బైపాస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్‌పై గుర్తులు లేకపోవడంతో బస్సు సడన్ బ్రేక్ వేసింది. దీంతో వెనుక వస్తున్న యోగి బస్సును ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఒకటో పట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.